స్పీకర్ ప్రసాద్ కుమార్‌కు స్వాగతం

స్పీకర్ ప్రసాద్ కుమార్‌ను సన్మానించిన కాంగ్రెస్ పార్టీ మండల నాయకులు

మర్పల్లి, నవంబర్ 17: స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ విదేశీ పర్యటన ముగించుకుని స్వదేశానికి వచ్చిన సందర్భంగా శనివారం రాత్రి మర్పల్లి మండల ప్రజలు స్వాగతం పలికారు. ఈ సందర్భంగా పుష్పగుచ్ఛం అందజేసి.. శాలువాతో సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో మండల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ పనులు ప్రారంభం

అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పనులు ప్రారంభిస్తున్న మున్సిపల్ చైర్మన్ అశోక్

పరిగి, నవంబర్ 17: మున్సిపాలిటీ పరిధిలోని 5వ వార్డులో అండర్ గ్రౌండ్ డ్రైనేజీ నిర్మాణ పనులను ఆదివారం మున్సిపల్ చైర్మన్ ముకుంద అశోక్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈ పనులను మున్సిపల్ సాధారణ నిధులతో చేపడుతున్నామన్నారు. అన్ని వార్డుల్లో అభివృద్ధి పనులకు సమానంగా నిధులను కేటాయించినట్ల ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ కల్లు శ్రీనివాస్‌రెడ్డి, కమిషనర్ వెంకటయ్య, సీనియర్ అసిస్టెంట్ దశరథం, కాలనీవాసులు పాల్గొన్నారు.

బదిలీపై వెళ్లిన ఉపాధ్యాయుడికి సన్మానం

ఉపాధ్యాయుడిని సన్మానిస్తున్న గ్రామస్తులు

కొడంగల్, నవంబర్ 17: మండల పరిధిలోని సంగాయిపల్లి ప్రాథమిక పాఠశాలలో 12 ఏండ్లు విధులు నిర్వహించి విద్యార్థులను తీర్చిదిద్దిన ఉపాధ్యాయుడిని గ్రామస్తులు సన్మానించారు. ఆదివారం సంగాయిపల్లిలో బదిలీపై వెళ్లిన ఉపాధ్యాయుడు లక్ష్మీనారాయణను సత్కరించారు. ఈ సందర్భంగా గ్రామానికి చెందిన విశ్రాంత ప్రధానోపాధ్యాయుడు హన్మయ్య మాట్లాడుతూ.. ఉపాధ్యాయులకు సమాజంలో ప్రత్యేక గుర్తింపు ఉందన్నారు. ఆయన నిబద్ధతతో పని చేసి ఎంతో మంది విద్యార్థులను గురుకుల పాఠశాలల్లో చేరేలా ప్రోత్సహించారని తెలిపారు. అలాగే పాఠశాలకు బదిలీపై వచ్చిన ఉపాధ్యాయురాలు రాజేశ్వరిని సన్మానించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి వశీం, రేషన్ డీలర్ ఆశప్ప, అంగన్‌వాడీ టీచర్ మంగమ్మ, ఆశ వర్కర్ తదితరులు పాల్గొన్నారు.

అధ్వానంగా పల్లె రహదారులు

- కంకర తేలిన ఎన్కేపల్లి-జిన్నారం రోడ్డు
- కూలిన కల్వర్టు
- భయం భయంగా ప్రయాణం
- పట్టించుకోని ప్రజాప్రతినిధులు, అధికారులు

కంకర తేలిన ఎన్కేపల్లి-జిన్నారం గేట్ పీఆర్ రోడ్డు

ఎన్కేపల్లి రోడ్డుకు ఒకవైపు కంకర తేలిన రోడ్డు, మరో వైపు కూలిన కల్వర్టు గొయ్యి

బంట్వారం (కోట్‌పల్లి), నవంబర్ 17: రహదారులు పల్లెల అభివృద్ధికి పట్టుగొమ్మలంటారు. అలాంటి రోడ్లు పూర్తిగా పాడైపోయాయి. కోట్‌పల్లి మండల పరిధిలోని పలు గ్రామాల రోడ్లు అధ్వానంగా మారాయి. ఆయా రహదారులపై ప్రమాదం ఉందని తెలిసినా సంబంధిత అధికారులు ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదు. రోడ్లపై గుంతలు పడి ఏండ్లు గడుస్తున్నా మరమ్మతులకు నోచుకోవడం లేదు. ఎన్కేపల్లి గ్రామ సమీపంలో ఉన్న రోడ్డులో కల్వర్టు కూలి పెద్ద గొయ్యి ఏర్పడింది. వాహనదారులు ఏమాత్రం అజాగ్రత్తగా ఉన్నా ప్రాణాల మీదికొచ్చే ప్రమాదం ఉన్నది. అదే రోడ్డులో మరో చోట బీటీ పూర్తిగా తొలగిపోయింది. ఈ రూట్‌లో వెళ్లే వాహనదారులు భయం భయంగా వెళ్తున్నారు. ప్రమాదం ఉన్న చోట కనీసం సూచిక బోర్డులూ ఏర్పాటు చేయలేదు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేయడం లేదు. రోడ్ల అభివృద్ధికి నిధులు కేటాయిస్తామన్నారు. అధ్వానంగా ఉన్న రోడ్లకు మరమ్మతులు చేయిస్తామని హామీలు గుప్పించారు. అధికారంలోకి వచ్చాక వాటి ఊసే ఎత్తడం లేదు. ఎన్కేపల్లి-జిన్నారం గేటు మార్గంలో ఉన్న రోడ్డుపై కంకర తేలి నడువలేని స్థితిలో ఉంది. వీటితో పాటు మండల పరిధిలోని పలు గ్రామీణ రోడ్లు గుంతలమయం కావడంతో వాహనదారులు అవస్థలు వర్ణణాతీతం. ఇప్పటికైనా సంబంధిత ఉన్నతాధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని ప్రయాణికులు, వాహనదారులు కోరుతున్నారు.



కల్వర్టు కూలి, ఏర్పడిన పెద్ద గొయ్యి

అధికారులు చర్యలు తీసుకోవాలి

మండల పరిధిలోని గ్రామీణ రోడ్లు అస్తవ్యస్తంగా మారాయి. రోడ్లపై కంకర తేలి ఉండడంతో నడువ లేని స్థితిలో ఉన్నది. వర్షాలు పడితే గుంతలు ఏర్పడుతున్నాయి. ఈ రోడ్లపై వెళ్లేందుకు వాహనదారులు భయాందోళన చెందుతున్నారు. కనీసం మరమ్మతులు చేయడం లేదు. రోడ్ల అభివృద్ధికి నిధులు కేటాయించాలి. సంబంధిత అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలి.

- సుందరి అనిల్, మాజీ సర్పంచ్, కరీంపూర్

ప్రమాదవశాత్తు చెరువులో పడి వ్యక్తి మృతి

వికారాబాద్, నవంబర్ 17: ప్రమాదవశాత్తు శివారెడ్డిపేట చెరువులో పడి ఓ వ్యక్తి మృతి చెందిన ఘటన వికారాబాద్ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. సీఐ భీమ్‌కుమార్ తెలిపిన వివరాలు.. మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కాప్రాకు చెందిన నరసింహ మహంతి చక్రీపురంలో నివాసం ఉంటూ లేబర్ పని చేస్తూ జీవిస్తున్నాడు. ఆయన కొడుకు విక్రమ్ మహంతి (24) మూడేండ్ల నుంచి సాఫ్ట్‌వేర్ ఉద్యోగం చేస్తున్నాడు. ఆర్థిక పరిస్థితి బాగా లేకపోవడంతో పాటు అప్పులు తీర్చలేని మనోవేదనతో ఇంట్లో నుంచి ఎవరికీ చెప్పకుండా స్కూటీపై హైదరాబాద్‌కు బయలుదేరారు. ఈ క్రమంలో శివారెడ్డి చెరువు వద్దకు రాగానే ప్రమాదవశాత్తు స్కూటీ అదుపు తప్పి చెరువులో పడిపోయాడు. ఈ ఘటనకు సంబంధించి కుషాయిగూడ పోలీస్ స్టేషన్‌లో మిస్సింగ్ కేసు నమోదు అయింది. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

విద్యుదాఘాతంతో మృతి

ప్రమాదవశాత్తు విద్యుదాఘాతంతో ఓ వృద్ధుడు మృతి చెందిన ఘటన వికారాబాద్ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. సీఐ భీమ్‌కుమార్ తెలిపిన వివరాలు.. వికారాబాద్ పట్టణంలోని గాంధీ కాలనీలో కొల్లూరు సోమేశ (86) నివాసం ఉంటున్నాడు. శనివారం రాత్రి సోమేశ ఎలక్ట్రికల్ రైస్ కుక్కర్‌లో అన్నం చేస్తుండగా ప్రమాదవశాత్తు షార్ట్ సర్క్యూట్‌తో షాక్ రావడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడి భార్య కళావతి రెండేండ్ల క్రితం మృతి చెందింది. ముగ్గురు కూతుళ్లు ఉన్నారు. వీరందరికీ వివాహాలు అయ్యాయి. మృతుడి పెద్ద కూతురు భర్త కొత్త అశోక్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

గుర్తు తెలియని వ్యక్తి..

గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందిన ఘటన వికారాబాద్ పట్టణంలో ఆదివారం జరిగింది. సీఐ భీమ్‌కుమార్ తెలిపిన వివరాలు.. వికారాబాద్ పట్టణంలో మధ్యాహ్నం 12 గంటలకు దుర్గా భవాని హోటల్ ముందు గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యం అయింది. యజమాని ప్యాట వీరేశం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. మృతుడి వయసు 40 నుంచి 45 ఏండ్ల మధ్య ఉంటుంది. కొన్ని రోజుల నుంచి రైల్వే స్టేషన్ పరిసరాల్లో భిక్షాటన చేస్తున్నట్లు పలువురు సమాచారం ఇచ్చారు. ఆయన ఒంటిపై గ్రీన్ కలర్ షర్ట్, దానిపై ఉలన్ చలికోటు, బూడిద రంగు ప్యాంటు ధరించి ఉన్నాడు. ఎవరైనా గుర్తిస్తే వికారాబాద్ పోలీసులు 8712670030 నంబర్‌కు సమాచారం ఇవ్వాలన్నారు.

బల్వంత్ రెడ్డి కుటుంబానికి చీఫ్ విప్ పరామర్శ

బల్వంత్ రెడ్డి కుటుంబాన్ని పరామర్శిస్తున్న ప్రభుత్వ చీఫ్ విప్ పట్నం మహేందర్ రెడ్డి

పెద్దేముల్, నవంబర్ 17: సర్పంచుల సంఘం మండల మాజీ అధ్యక్షుడు పట్లోళ్ల బల్వంత్‌రెడ్డి మాతృమూర్తి పద్మమ్మ అనారోగ్యంతో శనివారం మృతి చెందారు. విషయం తెలుసుకొన్న ప్రభుత్వ చీఫ్ విప్ పట్నం మహేందర్ రెడ్డి, తాండూరు ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి ఆదివారం ఆయన తల్లి మృతదేహం వద్ద పూలమాలలు ఉంచి నివాళులర్పించారు. ఈ సందర్భంగా బల్వంత్‌రెడ్డితో పాటు కుటుంబ సభ్యులను పరామర్శించారు. కార్యక్రమంలో నాయకులు నారాయణ రెడ్డి, కరణం పురుషోత్తం రావు, బాల్ రెడ్డి, ధారాసింగ్, జితేందర్ రెడ్డి, ఇందూరు ప్రకాశ్, మహిపాల్ రెడ్డి, ఎస్.నారాయణ రెడ్డి, హరిసూదన్ రెడ్డి, ఉప్పరి మల్లేశం, సర్దార్ ఖాన్, డీవై నర్సింహులు, సంజీవ రెడ్డి, రాజు, భగవాన్, కిరణ్, ఉప్పరి రవి, విజయ్‌కుమార్ పటేల్, అనంతయ్య పాల్గొన్నారు.

మొక్కలు నాటి.. పూజలు చేసి..

పరిగి, నవంబర్ 17: పట్టణంలోని బహార్ పేట హనుమాన్ మందిర్, మైసమ్మ ఆలయాల ఎదుట ఆదివారం గ్రామ పెద్దలు రావి, వేప మొక్కలు నాటారు. ఈ సందర్భంగా మాజీ సర్పంచ్ సిద్ధాంతి పార్థసారథి మొక్కలు నాటిన తర్వాత ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ ముకుంద అశోక్, మాజీ సర్పంచ్ సిద్ధాంతి పార్థసారథి, గ్రామ పెద్దలు కొప్పుల రఘుమోహన్‌రెడ్డి, జి.మాణిక్‌రెడ్డి, వేముల సత్యనారాయణ, కొప్పుల వెంకట్‌రెడ్డి, ఎర్రగడ్డపల్లి సత్తయ్య, కావలి యాదయ్య, ఆర్.ఆంజనేయులు, చిన్న నర్సింహులు, రాంరెడ్డి, శ్రీనివాస్, నరేశ్, లక్ష్మణ్, శ్రీశైలం, గణేశ్ పాల్గొన్నారు.



ఆలయం ఎదుట రావి, వేప మొక్కలు నాటి పూజలు చేస్తున్న పార్థసారథి

ఆధార్ అవస్థలు

- అప్‌డేట్ కోసం గంటల తరబడి పడిగాపులు
- అందినకాడికి దోచుకుంటున్న నిర్వాహకులు
- ఇబ్బంది పడుతున్న మండల వాసులు
- మండల కేంద్రంలో ఆధార్ కేంద్రం ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి



వికారాబాద్‌లో ఆధార్ కార్డులో పేరు సరి చేయించుకోవడానికి వేచి ఉన్న మర్పల్లి వాసులు

మర్పల్లి. నవంబర్ 17: ప్రతి సంక్షేమ పథకంతో పాటు రేషన్, బ్యాంకు, పాన్ కార్డు, ప్లాట్ రిజిస్ట్రేషన్ ఇలా ప్రతి దానికీ ఆధార్ కార్డు తప్పనిసరి కావడంతో దానిని పొందడానికి లబ్ధిదారులు పలు అవస్థలు పడుతున్నారు. ప్రస్తుతం ఆధార్ అన్నింటికీ లింక్ ఉండడంతో ప్రతి ఒక్కరికీ ఆధార్ తప్పనిసరి అయింది. మండల కేంద్రంలో ఆధార్ సెంటర్ లేకపోవడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ఆధార్ కార్డుతో ఏదైనా సంక్షేమ పథకానికి లింక్ చేయించడానికి వెళితే అది పని చేయకపోవడంతో అప్‌డేట్ చేయడానికి పలు అవస్థలు పడుతున్నారు. కొత్త ఆధార్‌కార్డు తీసుకోవడానికి, పాత వాటిలో తప్పులు సవరణ చేయించుకోవడానికి మోమిన్‌పేట, వికారాబాద్, సంగారెడ్డి జిల్లా సదాశివపేట పట్టణాలకు వెళ్లాలి. అక్కడ సమయానికి పనులు కాకపోవడంతో పడిగాపులు గాయాల్సి వస్తున్నది. ఆయా పట్టణాల్లోని ఆధార్ సెంటర్ల దగ్గరకు వెళితే ఆ సెంటర్లన్నీ లబ్ధిదారులతో కిట కిటలాడుతుండడంతో గంటల కొద్దీ వేచి ఉన్నా ప్రజలకు పని అయ్యే పరిస్థితి కనిపించడం లేదు. ఒక్కోసారి రెండు, మూడు రోజులు ఆధార్ కేంద్రాల చుట్టూ తిరగాల్సి వస్తున్నదని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం ప్రవేశ పెడుతున్న సంక్షేమ పథకాలకు ఆధార్‌కార్డు తప్పనిసరి కావడంతో ఇతర పనులు వదులుకుని ఇతర ప్రాంతాలకు వెళ్లాల్సి రావడంతో అదనపు ఖర్చులు అవుతున్నాయని పేర్కొంటున్నారు. ఇదే అదునుగా భావించిన పలు కేంద్రాల నిర్వాహకులు ఇష్టానుసారంగా దోచుకుంటున్నారని పలువురు ఆరోపిస్తున్నారు. సంబంధిత అధికారులు స్పందించి మర్పల్లి మండల కేంద్రంలో ఆధార్ కేంద్రాన్ని ఏర్పాటు చేయించాలని మండల ప్రజలు కోరుతున్నారు.

శిష్యుడికి గురువు ఆర్థిక సాయం

ఆర్థిక సాయం అందజేస్తున్న విశ్రాంత ఉపాధ్యాయుడు బిచ్చిరెడ్డి

దోమ, నవంబర్ 17: మండల కేంద్రానికి చెందిన ఎండీ రఫీక్ అనారోగ్యంతో బాధపడుతూ నగరంలోని ఓ ప్రైవేటు దవాఖానలో చికిత్స పొందుతున్నారు. తోటి శిష్యుల ద్వారా విషయం తెలుసుకొన్న విశ్రాంత ఉపాధ్యాయుడు సి.బిచ్చిరెడ్డి స్పందించారు. రఫీక్ దవాఖాన ఖర్చులకు రూ.5వేలు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎవరు ఎవరికీ సాయం చేశారన్నది ముఖ్యం కాదని, మానవత్వంతో కష్టకాలంలో ఉన్న వారిని ఆదుకోవడం ప్రతి ఒక్కరూ అలవర్చుకోవాలన్నారు. కార్యక్రమంలో బిచ్చిరెడ్డి శిష్యులు మాజీ కోఆప్షన్ సభ్యుడు ఖాజాపాషా, బోసు, శ్రవణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ప్రీ లాంచింగ్ పేరుతో మోసాలు

రియల్ ఎస్టేట్ వ్యాపారి ఇంటి వద్ద బాధితుల ఆందోళన

బంజారాహిల్స్, నవంబర్ 17: ప్రీ లాంచింగ్ ఆఫర్ పేరుతో రియల్ ఎస్టేట్ సంస్థ తమను మోసం చేసింది. చెల్లించిన డబ్బులు తిరిగి ఇవ్వాలంటూ బాధితులు ఆందోళనకు దిగారు. వివరాలిలా ఉన్నాయి.. భారతి బిల్డర్స్ అనే రియల్ ఎస్టేట్ సంస్థ కొంపల్లి పరిధిలో ఆరున్నర ఎకరాల్లో ప్రాజెక్ట్ చేపట్టింది. ప్రీ లాంచింగ్ ఆఫర్ కింద తక్కువ ధరకు ప్లాట్స్ అంటూ నమ్మించిన సంస్థ ప్రతి నిధులు సుమారు 400 మంది వద్ద నుంచి లక్షలాది రూపాయలు వసూలు చేశారు. అయితే, నాలుగేండ్లు పూర్తయినా ప్రాజెక్టు పనులు ప్రారంభించక పోవడంతో సంస్థ ఉద్యోగులు గతంలోనే పలుమార్లు ఆందోళనకు దిగారు. కాగా, బంజారాహిల్స్ రోడ్ నం.12లోని ఎమ్మెల్యే కాలనీలో నివాసముంటున్న సునీల్‌కుమార్ అహుజా అనే వ్యాపారి సంస్థలో పెట్టుబడి పెట్టానని, బాధితులకు న్యాయం చేస్తానని నమ్మబలికాడు. కొన్నాళ్ల తర్వాత భారతీ బిల్డర్స్ సంస్థను తన పేరుపై మార్చుకున్నాడు. అయితే, బాధితులకు డబ్బులు తిరిగి ఇవ్వకుండా వేధిస్తుండటంతో వీరంతా సైబరాబాద్ కమిషనరేట్ పరిధిలోని ఆర్థిక నేరాల విభాగంలో ఫిర్యాదు చేశారు. నెలలు గడిచినా నిందితుడిపై చట్టపరమైన చర్యలు తీసుకోలేదు. డబ్బులు ఇవ్వకపోవడంతో వారంతా ఆదివారం ఎమ్మెల్యే కాలనీలోని సునీల్ కుమార్ అహుజా నివాసం వద్ద ఆందోళన చేపట్టారు. సునీల్‌కుమార్ అహుజాకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు.

కనుల పండువగా సదర్ సంబురం

దున్నపోతులతో కౌన్సిలర్ మధుసూదన్‌రావు యాదవ్, ఉపవైద్యాధికారి రవీంద్రయాదవ్

కొడంగల్, నవంబర్ 17: దీపావళి అనంతరం యాదవులు నిర్వహించే సదర్ ఉత్సవాల్లో భాగంగా దున్నపోతులతో ఊరేగింపు నిర్వహించి విన్యాసాలు చేయించడం ఆనవాయితీ. కార్యక్రమంలో భాగంగా ఆదివారం పట్టణంలో యాదవులు సదర్ ఉత్సవాన్ని కనుల పండువగా నిర్వహించారు. స్థానిక గాడిబావి శివాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం అక్కడి నుంచి అంబేద్కర్ కూడలి వరకు దున్నపోతులతో ఊరేగింపు చేపట్టారు. దారి పొడవునా పటాకులను కాలుస్తూ.. సందడి చేశారు. దున్నపోతులతో విన్యాసాలు చేయిస్తూ ఊరేగింపు నిర్వహించారు. దున్నపోతుల విన్యాసాలు చూపరులను ఎంతగానో ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో మున్సిపల్ పరిధిలోని 2వ వార్డు కౌన్సిలర్ మధుసూదన్‌రావు యాదవ్, ఉపవైద్యాధికారి రవీంద్రయాదవ్, రాహుల్ యాదవ్, దాసప్పయాదవ్‌తో పాటు మండల పరిధిలోని యాదవులు పాల్గొన్నారు.

వైభవంగా దీపోత్సవం

తాండూరు, నవంబర్ 17: కార్తిక పౌర్ణమిని పురస్కరించుకొని ఆలయాల్లో మహిళా భక్తులు దీపాలు వెలిగించారు. దీంతో ఆలయాలకు కార్తిక శోభ సంతరించుకొన్నది. ఈ సందర్భంగా తాండూరు పట్టణంలోని సీతారాంపేటలో ఉన్న గోశాలలో ఆదివారం నిర్వాహకులు కార్తిక దీపోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. గో సేవకులు, భక్తులు భారీ సంఖ్యలో గోసేవ కార్యక్రమంలో పాల్గొన్నారు. మహిళా భక్తులు వేసిన రంగవల్లులు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. తాండూరుకు చెందిన ప్రముఖులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్
WANTED
★ హరేకృష్ణ హోంకేర్, హైదరాబాద్ నందు వృద్ధులను, పేషెంట్స్‌ను చూసుకొనుటకు వర్కర్స్, నర్సులు కావలెను. ఉచిత వసతి, భోజనం. జీతం: 16K to 18K, ఏజెంట్ కమీషన్ 6K. Ph: 9640258899 / 9640468899.
NT-338958-All
గమనిక: క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్/డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

మార్కెట్ కమిటీ చైర్మన్‌కు సన్మానం

ఆంజనేయులును సన్మానిస్తున్న శ్రీరామాంజనేయ కళా నాట్యమండలి సభ్యులు

కులకచర్ల, నవంబర్ 17: మండల పరిధిలోని ముజాహిద్‌పూర్‌కు చెందిన బీఎస్ ఆంజనేయులు కులకచర్ల మార్కెట్ కమిటీ చైర్మన్‌గా ఎంపికయ్యారు. ఈ సందర్భంగా ముజాహిద్‌పూర్ శ్రీరామాంజనేయ కళా నాట్యమండలి సభ్యులు ఆంజనేయులును ఆదివారం సన్మానించారు. శ్రీరామాంజనేయ కళానాట్యమండలి సభ్యుడు మార్కెట్ కమిటీ చైర్మన్‌గా ఎంపిక కావడం సంతోషకరమని సభ్యులు శుభాకాంక్షలు తెలిపారు. తనను సన్మానించిన నాట్యమండలి సభ్యులు, పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు.

కలప లారీ పట్టివేత

బషీరాబాద్, నవంబర్ 17: కలపను అక్రమంగా తరలిస్తున్న లారీని పట్టుకున్నట్లు ఏఎస్సై నారాయణ ఆదివారం తెలిపారు. మండల పరిధిలోని జీవన్గి గ్రామం నుంచి అక్రమంగా కలపను తరలిస్తున్నారని 100 నంబర్‌కు డయల్ చేసి సమాచారం ఇచ్చారని తెలిపారు. సిబ్బందితో కలిసి వెంటనే గ్రామానికి వెళ్లి లారీని పట్టుకున్నామని తెలిపారు. వివరాలు అడుగగా మంచిర్యాల జిల్లా బెల్లంపల్లి మండల పరిధిలోని బుధగుట్టు గ్రామమని డ్రైవర్ మహేందర్ తెలిపారు. కలపకు సంబంధించి ఎలాంటి పత్రాలు లేవని చెప్పడంతో లారీని పోలీస్ స్టేషన్‌కు తరలించి అటవీ శాఖ అధికారులకు అప్పగించామని ఏఎస్సై తెలిపారు.

ఉప్పల్‌లో జిల్లాస్థాయి తైక్వాండో పోటీలు

సిటీబ్యూరో, నవంబర్ 17 (నమస్తే తెలంగాణ): క్రీడా పోటీలు విద్యార్థులలో మనోస్థైర్యాన్ని పెంపొందించడంతో పాటు ఈ పోటీ ప్రపంచంలో ఉన్నత స్థానాన్ని చేరేందుకు తోడ్పడుతాయని తైక్వాండో మేడ్చల్ జిల్లా అధ్యక్షుడు సుధీర్, కార్యదర్శి శివకుమార్ అన్నారు. ఉప్పల్‌లో ఆదివారం లక్ష్మారెడ్డి కాలనీలోని కమ్యూనిటీ హాల్‌లో జిల్లా స్థాయి తైక్వాండో పోటీలను నిర్వహించారు. ఈ పోటీలలో 165 మంది బాల బాలికలు పాల్గొన్నారు. ఈ పోటీలలో గెలుపొందిన వారికి బంగారు, వెండి, రజిత పతకాలు అందజేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన కాలనీ అధ్యక్షుడు హన్మంత్‌రెడ్డి, కార్యదర్శి ప్రేమ్‌కుమార్, కేవీ స్కూల్ స్పోర్ట్స్ ఇన్‌చార్జి సూర్యప్రకాశ్, తైక్వాండో కోచ్‌లు పృథ్వీ, భాస్కర్, సాయి, యశ్వంత్, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

హామీ ఇచ్చి ఏడాది దాటింది.. పట్టించుకోని సీఎం రేవంత్ రెడ్డి

హైదరాబాద్ ఆట ప్రతినిధి నవంబర్ 17: జాతీయ, అంతర్జాతీయ క్రీడాకారులుగా తీర్చిదిద్దుతున్న తెలంగాణ స్పోర్ట్స్ అథారిటీ కోచ్‌లను గ్రేట్-3 ఉద్యోగులుగా అధికారంలోకి వచ్చిన ఒక నెలలో ప్రకటిస్తామని సీఎం రేవంత్ రెడ్డి హామీ ఇచ్చి ఏడాది దాటుతున్నా ఇప్పటికీ పట్టించుకోవడంలేదని కోచ్‌లు ఆవేదన వ్యక్తం చేశారు. ఎన్నికల ముందు సీఎం ఇచ్చిన హామీని వెంటనే అమలు చేయాలని కోరారు.

నియామకాలకు కృషి చేస్తా: మధుయాష్కీ గౌడ్

తెలంగాణ స్పోర్ట్స్ అథారిటీ కోచ్‌లను గ్రేట్-3 ఉద్యోగులుగా నియామకాల కోసం సీఎం రేవంత్ రెడ్డితో చర్చిస్తానని, నియామకాల కోసం కృషి చేస్తామని పార్లమెంట్ మాజీ సభ్యుడు మధుయాష్కీ గౌడ్ అన్నారు. ఆయన నివాసంలో కలిసిన స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ తెలంగాణ కోచ్‌ల సంఘం ప్రతినిధుల బృందానికి ఆయన హామీ ఇచ్చారు. ప్రతి ఒక్కరూ సాధన చేసి ఒలింపిక్ క్రీడల్లో పతకాలు సాధించడమే లక్ష్యంగా పెట్టుకొని ముందుకు సాగాల్సిన అవసరం ఉన్నదని ఆయన క్రీడాకారులకు పిలుపునిచ్చారు.

మన రాష్ట్రం మన పత్రిక
నమస్తే తెలంగాణ
Telangana Today
FOR LOCAL TO GLOBAL NEWS
పుట్టినరోజు, పదవీ విరమణ, వార్షికోత్సవ శుభాకాంక్షలు, వర్ధంతి, జయంతి, లీగల్ నోటీసులు మరియు ఇతర ప్రకటనల కొరకు ఈ దిగువ తెలిపిన నెంబర్లపై సంప్రదించగలరు.
ప్రకటనల విభాగం సెల్: 80966 77655
వికారాబాద్/పరిగి/శంకర్‌పల్లి/తాండూర్/కొడంగల్ } 80966 77668
ఇబ్రహీంపట్నం/మహేశ్వరం : 80966 77962